# సూర్యనారాయణ సుందరీమణులు

-వెలివల సాంబశివరావు



**త**నకొచ్చిన మనియార్డరు మీద సంతకము పెట్టటానికి భర్తవంక చూచింది సుందరి. సుబ్బారావు యెటో చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉన్నాడు. భర్త ముఖంలోని కదలికల్ని గమనిస్తూ ఉన్నది.

"సంతకం చేయండమ్మా" అంటూ డబ్బులు లెక్క పెడుతున్నాడు పోస్ట్‌మ్యాన్.

సుబ్బారావు టపటపమంటున్న ఆ పచ్చ కాగితాల శబ్దం వైపు తిరిగాడు. అదో రకంగా గమనిస్తున్నాడు.

సుందరి 'ఏమండీ... సంతకం చేయమంటారా' అని బేలగా అడిగింది.

భార్య కనపర్చిన బాధను అర్థం చేసుకున్న వాడిలా సాధ్యమైనంత సౌమ్యంగా "ఆ

మనియార్డరు మా ఆవిడకేనా వచ్చింది. అడ్రస్ సరిగ్గా చూసారు గదా" అని పోస్ట్‌మ్యాన్‌ను అడిగాడు సుబ్బారావు.

"అయ్యా... చిరునామా సరిగ్గానే వున్నది. సుందరి వైఫ్ ఆఫ్ సుబ్బారావు, ఆడపావారి వీధి, ఆర్ అగ్రహారం, గుంటూరు' అని మళ్ళీ చదివాడు పోస్ట్‌మ్యాన్.

"సంతకం చేశావా సుందరీ' ముక్తసరిగా అడిగాడు సుబ్బారావు.

"చేశానండి" అంది సుందరి బెరుకు బెరుగ్గా.

సుందరి వంక చిరాగ్గా సుబ్బారావు చూడక పోయినా అలాంటి భావమే, అతని మనస్సులో వున్నట్లు ఊహించుకొన్నది సుందరి. ఆ సమయంలో ఆమెకు ఊపిరి పీల్చి విడవటం కూడా కష్టమైంది.

"అయ్యా! సుబ్బారావు గారూ! ఏదన్నా పొరపాటున ఒకరికి యివ్వాల్సిన డబ్బులు మరొకరికి యిస్తే మీకేం లేదు గాని ముందు ముంచుకు వచ్చేది మాకే. మా ఉద్యోగాన్ని పీకేయటమే" అంటూ పోస్ట్‌మ్యాన్ వంద రూపాయల నోట్లను ఇరవై సుబ్బారావు చేతిలో పెట్టాడు.

సుబ్బారావు తీసుకొని లెక్కేసుకొని "రెండు వేల రూపాయలు సరిపోయాయి శంకర్ బాబూ" అన్నాడు.

మనియార్డరు కూపన్ను చింపి సుందరికిచ్చాడు పోస్ట్‌మ్యాన్.

దాన్ని తీసుకొని భర్తకిచ్చింది సుందరి.

ఆ కూపను తీసుకొని, ఆ డబ్బు మొత్తాన్ని "ఇది నీ డబ్బు" అంటూ సుందరి చేతిలో పెట్టాడు సుబ్బారావు.

'అయ్యా! లెక్క చూసుకున్నారు గదా! సరిపోయినట్లేనా....' అంటూ నవ్వు తెచ్చుకుంటూ సుబ్బారావు వంక చూశాడు పోస్ట్‌మ్యాన్.

అతడి వాలకాన్ని గ్రహించాడు. తన జేబులో నుండి ఒక కాగితాన్ని తీసి పోస్ట్ మ్యాన్‌కి అందించాడు సుబ్బారావు.

అతడు సంతృప్తిగానే నవ్వుకొంటూ వెళ్ళి పోయాడు.

"ఏమండీ.... అందులో ఏం వ్రాసి వుందండి?" ఎంతో ఆదుర్దాగా అడిగింది సుందరి.

"మరేమీ అనుకోకు. ఈ డబ్బుతో ఏదన్నా పట్టు చీరకొనుక్కో" అని పరిహాసంగా చదివి వినిపించాడు భర్త.

"మా నాన్నగారా...?"

"కాదు.... నాకు తెలియని నీకు తెలిసిన సూర్యం...."

"ఏవడండీ ఆ సూర్యం?"

"ఆ... సూర్యం ఎవ్వరో తెలియకుండానే - రెండు వేల రూపాయలు తీసుకోవటానికి సంతకం చేశావా.... సుందరీ.... ఓ దివ్య సుందరీ...."

"నిజంగా... ఆ సూర్యం ఎవ్వరో నాకు తెలీయదండీ" పోనీ ఆ సూర్యం ఎవ్వరో నీకు తెలియక పోయినా.... అతడు వుండేది ముషీరాబాద్, సెంట్రల్ జైల్లో అని తెలుసు గదా.... అందుకే ఇటీవలనే ముషీరాబాదులో ఎవ్వరో బంధువుల యింట్లో ఫంక్షన్ వుందని నేను రాకపోయినా నువ్వు వెళ్ళి వచ్చావు..... అయితే సమయం సందర్భం సంగతి యిప్పుడర్థమైంది.... మొన్న వెళ్ళినప్పుడు నీ శ్రేయోభిలాషికి విషయం చెప్పి ఉంటావు. అతడు వెంటనే నీ కోర్కె మన్నించి మనియార్డరు ద్వారా అమౌంటు అందజేశాడు గదూ" అన్నాడు సుబ్బారావు మాటల్ని వత్తి వత్తి వక్రీకరించి పలుకుతూ.

సుందరి - తనకేమీ తెలియదంటూ వెక్కి వెక్కి ఏడవ సాగింది. పిల్లలు యిద్దరూ అయోమయంగా, తల్లి దగ్గరికి చేరారు. తండ్రి వంక భయం భయంగా చూడశాగారు.

* * *

కొత్త పట్టు చీర కట్టుకొని, తన భర్త 'మురళి'కి గుమ్మంలో నుండే సాదరంగా స్వాగతం చెప్పింది మణి.

ఆ చీర సోయగానికి మహా మురిసిపోయాడు మురళి.

"ఈ చీరను ఎప్పుడు కొన్నావేంటి... నాకు ఇంతకు ముందు చెప్పను కూడా చెప్పలేదు." అన్నాడు మురళి మురిపంగానే.

"అదేమన్నా గొప్ప విషయమా యేంటి.... అయినా కాకపోయినా చెప్పటానికి టైమెక్కడిది.... అందుకే ఆ చీరతోనే స్వాగతం చెప్పానుగా."

అచ్చట్లు ముచ్చట్లతో టీ సేవించారు.

"ఇవ్వాళ ఒక వింత జరిగింది."

"మన అపార్టుమెంటులోని 'లిఫ్టు' మధ్యలోనే ఆగిపోతే అందులో వున్న లైలా..... మజ్నూలు రెచ్చిపోయారు."

"మీకెప్పుడూ ఆ ప్రేమ పిచ్చి.... గొడవే.... అస్సలు ఈ చీర ఎట్లా కొన్నావేంటి అని అడగలేదేం...."

"అస్సలు అలాంటి అవకాశం నాకెప్పుడూ యివ్వవు గదా.... అందులో మన మధ్య దాపరికాలు లేవుగదా...."

"మన ఇద్దరి మధ్య అయితే లేవు గాని.... నాకు తెలియకుండానే ఏదో దాపరికం వున్నట్లనిపి స్తున్నది."

"అదేంటి?"

"అవునండీ.... ఈ రోజున నా పేర్న రెండు వేల రూపాయలు ఎం.ఒ వచ్చింది అడ్రసు కరెక్టుగానే వున్నది."

"తీసుకున్నావా ఆ అమౌంటు!"

"తీసుకోక చస్తానా.... తీసుకున్నాను. ఈ కోక కొన్నాను.... ఆ అమౌంటు..... మీ నాన్న గారు గాని మా నాన్నగారూ పంపించింది కాదు...?" ఆశ్చర్యంగా చెప్పింది మణి.

"మరి...!"

"నారాయణగారు....!"

"వారెవ్వరు....?"

"కెరాఫ్ సెంట్రల్ జైలు, ముషీరాబాదు. మనియార్డరు కమ్యూనికేషన్‌లో మరేమీ అనుకోక పట్టుకోక కొనుక్కో అని వ్రాశాడండి...."

"మంచి పని చేశాడు..... పట్టు కోక కొనుక్కోమని...."

"అదేంటండీ! మీరు అట్లా మాట్లాడుతారేంటి... సెంట్రల్ జైల్లో వున్న తను నాకు రెండు వేలు పంపడమేంటి.... రేపు ఏదన్నా ఎంక్వయిరీ జరిగితే... జైలు అధికారులు నన్ను కూడా బయటకు లాగుతారు కదండీ.... అతడికి నాకూ దగ్గరి సంబంధం చుట్టరికమో వుందని నన్ను కూడా ఇంటరాగేట్ చేసి కటకటకాల వెనక్కు పంపిస్తారని గుండెల్లో గుబులుగా, చెప్పలేనంత భయంగా వుందండి! ఎం.ఒ వచ్చిందన్న తొందర్లో ఈ పట్టు చీరను కొన్నానన్న మాటే గాని, చచ్చినంత యిదిగా వుందండీ" అన్నది మణి. ఇప్పుడామె ముఖంలో కళాకాంతులు లేవు. భర్త అస్సలేమీ పట్టించుకోనందుకు బావురుమంది.

"మణీ! ఇదేంటి... మరీ నువ్వింత బేలవనుకోలేదు. నువ్వు హైస్కూల్లో చదివే రోజుల్లో అకతాయి అబ్బాయిల్ని చెంపల మీద కొట్టి ఉంటావు. లేకుంటే కాలేజీ క్యాంపస్‌లో రోమియోలకు బుద్ధి చెప్పి వుంటావు. మనం ఇద్దరం ఎంతో అన్యోన్యంగా, హాయిగా సంసారం చేసుకు పోతున్నామని, దాన్ని చూచి, గిట్టని నీ చిన్న నాటి శత్రువులెవ్వరో, నీ పేర ఈ రెండు వేల రూపాయలు ఎం.ఒ చేసి వుంటారు....." అన్నాడు మురళి మామూలు ధోరణిలో.

"అమ్మో! ఇందులో యింత మోసం ఉందనుకోలేదండి. ఏదో వెర్రి మాలోకంలా... ఎగబడి చీరకొన్నాను.... అయితే మీరు నన్ను ఇంట్లో నుండి వెళ్ళ గొడతారా...." అడిగింది మణి.

"ఎనిమిదేళ్ళ నుండి నాతో కాపురం చేస్తున్నా.... ఎంత మాట అన్నావు మణి. ఇదేనా నన్ను గురించి నీవు తెలుసుకున్నది.... భార్య మీద భర్తకు, భర్త మీద భార్యకు కావాల్సింది నమ్మకం. అంతేగాని వాళ్ళూ వీళ్ళూ కల్పించేవాటి ప్రభావం భార్యా భర్తల

**(70వ పేజీ చూడండి)**

మీద పడకూడదు. నీ మీద నాకు ప్రేమే గాదు పూర్తి నమ్మకం ఉంది. నిన్ను కలలో కూడా వదలను మణీ... ఆ విషయాన్ని గురించి నువ్వు ఆలోచించటం మానేయ్. నేనే నిదానంగా... నీ శ్రేయోభిలాషిని గురించి తెలుసుకొంటాను" అన్నాడు మురళి.

ఆక్షణంలో మురళి తనను ఓదార్చిన విధానానికి, అతడు యిచ్చిన భరోసాకు, మణి, అతని చేరువలో గువ్వలా వొదిగిపోయింది.

❋ ❋ ❋

సుబ్బారావులో మొలకగావున్న అనుమానం మానులా పెరిగిపోయింది. సుందరిని అసలు పట్టించుకోవటం మాని వేశాడు. సమయంగాని సమయంలో రావటం పోవటం, పిల్లలతో కూడా మాట్లాడటం లేదు.

సుందరి గుండెల్లో బండంత దుఃఖాన్ని పెట్టుకొని, కాలాన్ని నెట్టుకొస్తున్నది. పిల్లల కోసం నాలుగు మెతుకులు ఉడకేసి వాళ్ళకు లోటు రానీయకుండా భోజనం పెట్టి బుజ్జగిస్తోంది. పిల్లలు కూడా నువ్వు తినక పోతే మేమూ అన్నం ముట్టుకోం తిను అంటూ, మారాం చేస్తున్నారు. నాన్నవచ్చి, అమ్మను ఎప్పుడు లాలించి బుజ్జగిస్తాడా అని యెదురు చూస్తున్నారు.

తనకు తెలిసినంతలో అలాంటి సంకట స్థితి ఎప్పుడూ రాలేదనుకొంది. దానికి తగిన పరిష్కారం ఆ జగన్మాతే చూపించాలని మనస్సులోనే మ్రొక్కుకున్నది.

మొండిగా బ్రతుకుతున్నది. తనలో ఏ దోషం లేదని, తెలియటానికి మార్గం వెతుకుతున్నది. అది సుఖాంతమో - దుఃఖాంతమో నిర్ణయించేది కాలమే అనుకున్నది.

## సూర్యనారాయణ సుందరీమణులు

(67వ పేజీ తరువాయి)

ఆ విధంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. దాని పర్యవసానం, తాను ఏమైనా తన భర్తకు మాత్రం, తన మీద ఒక సదభిప్రాయం కలిగితే చాలనుకొంది. ఆ సమయంలో తన దగ్గర్లోనే ఉన్న పిల్లలిద్దర్నీ మళ్ళీ మళ్ళీ ముద్దాడింది. గుండెలకు హత్తుకొంది. ఆమె అంతరంగంలో ఒక అనిర్వచనీయమైన ఆనందం పురకలేసింది.

తల్లి ఆ విధంగా ఒక్కసారి ఆనందంతో ఉక్కిరి బిక్కిరై పోతూ ఉత్సాహంతో ఉన్న తీరును చూస్తూ పిల్లలిద్దరూ భయం భయంగా చూస్తున్నారు, ఆమె వంక.

❋ ❋ ❋

"గుడ్ మార్నింగ్ సర్!" మణి, మురళి ఇద్దరూ అభివాదం చేశారు.

"గుడ్ మార్నింగ్ మేడమ్ అండ్ జెంటిల్ మాన్" అతడు ప్రతి అభివాదం చేశాడు.

"మాకు ఒక ఇన్ఫర్మేషన్ కావాలని వచ్చామండి. మీ సెంట్రల్ జైల్లో నారాయణ అని ఎవరన్నా ఉన్నారా?" అడిగాడు మురళి.

ఎందుకు అవసరం అయింది, అతని విషయం మీకు? "మరేం లేదండి, నారాయణ అనే అతడు మా ఆవిడ పేర రెండు వేల రూపాయలు ఎం.ఒ. పంపించాడు. అతడెవరో అలా ఎందుకు పంపించాడో అర్థం కావటంలేదు" చెప్పాడు మురళి.

"ఓ.... ఐ.సీ... ఈ అమ్మాయి పేరు..... మణి... యేనా....?"

"మీకెలా తెలుసు" ఆశ్చర్యంగా అడిగాడు మురళి.

"మిస్టర్ మురళి గారూ.... అదంతా ఒక విచిత్రమైన వింత కథ.... అక్కా చెల్లెండ్రను అభిమానంగా చూసుకోవాలని పరితపించే ఒక సోదరుని విషాద గాథ.... మీరన్నట్లు అతని పేరు నారాయణ కాదు."

"మరి?"

"సూర్యనారాయణ.... అన్నట్టు సుందరి సుబ్బారావు గార్లు కూడా వచ్చారా.....?" అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు జైలరు.....

"వాళ్ళెవ్వరో మాకు తెలియదండి...." అన్నది మణి.

"వాళ్ళెవ్వరో మీకు తెలియక పోయినా మీరెవ్వరో నాకు తెలుసండి...?" నవ్వుతూనే అన్నాడు జైలరు.

"వాట్...."


"చూడండి మిస్టర్ మురళి. ఈమె కాలేజీ క్యాంపస్‌లో కనిపిస్తే చాలు మగ పిల్లలందరికీ హడల్. ఈమెకు 'అగ్గి బరాటా' అని పేరు పెట్టాం. ఆడపిల్లల కెవరికైనా అన్యాయం జరిగిందంటే చాలు నడుం కట్టి రుద్రమాంబలా ప్రత్యక్షమయ్యేది. అందరూ ఈమెను సోదరీ..... సిస్టర్.... అంటూ మగపిల్లలంతా పిలిచేవాళ్ళు.

రాఖీ పండగ రోజున ఆమె చేతికి రాఖీ కట్టని మగ పురుషు వుండడంటే నమ్మండి" అన్నారు జైలరు ఎంతో అభిమానంగా.

"ఒరేయ్.... నువ్వంట్రా.... నా క్లాస్ మేట్ బ్రదర్ బదరీ" అంటూ పట్టరాని ఆనందంతో జైలర్ బదరిని మణి వీపు మీద చరిచింది.

"అప్పుడూ మా సిస్టర్ తీరు యింతేనండి" అన్నాడు బదరీ. జైల్లోని బందోబస్తులో ఉన్న సెక్యూరిటీ గార్డులంతా విచిత్రంగా చూస్తున్నారు. బదరీ చెప్పకుండానే కూల్ డ్రింక్స్‌ను తెచ్చి వాళ్ళ ముగ్గురికీ యిచ్చాడు ఒక కానిస్టేబుల్.

"అసలు విషయమేమిటంటే.... సూర్యనారాయణ అనే అతడు బాగా చదువుకున్న వాడు. బ్యాంక్ ఉద్యోగం కూడా చేస్తూ ఉండేవాడు. అతడికి సుందరి, మణి అనే అక్కా చెల్లెలూ ఉండేవారట. వాళ్ళకి పెళ్ళి చేసిన తర్వాత, వాళ్ళ ఆడబడుచుల చేతిలో వాళ్ళు, ఆరళ్ళను తట్టుకోలేక మరణించడం జరిగిందట. ఆ సంఘటనలు జరిగిన తర్వాత అతడు పూర్తిగా అప్‌సెట్ అయిపోయి, ఆడవాళ్ళంటే ఎలర్జీ ఏర్పడి, వాళ్ళను పెళ్ళి చూపుల పేరిట చాలా మందిని హెరాస్ చేశాడంట. కొంత మంది అతని మీద కోర్టులో కేసులు పెట్టటం, అవి ఋజువై అతనికి ఏడేళ్ళు జైలు శిక్ష పడటం, దాన్ని అనుభవించటం జరిగింది. అయితే అతని పెళ్ళి చూపుల్లో 'సుందరి, మణి'లను కూడా చూడటం జరిగిందట. ఆ రెండు పేర్లు అతని అక్క, చెల్లెలివి



కావటం వలన, వాళ్ళిద్దరినీ చూస్తుంటే తన అక్కా చెల్లెళ్ళని చూసినట్లే ఉండేదని, వాళ్తో పదే పదే ప్రతి పండక్కీ అంటూ ఉండేవాడు. తన అక్కా, చెల్లెలు ఇద్దరూ సంతోషించినట్లే ఉంటుందని, పండక్కి పట్టుచీరలు కొనుక్కోవటానికి, చెరో రెండు వేల రూపాయలు పంపిస్తున్నట్లు నాకు చెప్పాడు. తన శిక్ష పూర్తి కాకముందే డబ్బు పంపిస్తే, మీరు రావటం పరామర్శించటం తనకు ఇష్టం ఉండదని చెప్పాడు సిస్టర్...! నువ్వు కాలేజీలోనే గాక బయట ప్రపంచంలోనికి వచ్చిన తర్వాత కూడా మంచి చెల్లివి అనిపించుకున్నావు. నిజంగా... అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ...." అన్నాడు బదరీ బోలెడంత యిదిగా.

"ఒరేయ్ బ్రదర్... బదరీ.... నువ్వు పోలీసు వయినా... నీకు బుద్ధి లేదు.... సూర్యం అనే పేరుతో సుందరి అనే ఆమెక్కూడా రెండు వేల రూపాయలు పంపించాడన్నావు గదా...."

"అది నిజమే...."

"అది నిజమే అని మూడో తరగతి చదివే అమ్మడిలా అంటే సరిపోతుందా..... తన భార్యకు రెండు వేలు రూపాయలు ఎవ్వడో ముక్కూ మొఖం తెలియని వాడు పంపిస్తే, మా ఆయన ఆనందపడ్డట్టు... ఆ సుబ్బారావుగారు సంతోషించవద్దూ.... నా మనస్సు ఎందుకో కీడును శంకిస్తోంది. నో.... నో...ఐ డోంట్ కేర్... నాకు దేవుడిచ్చిన అక్క అయిన ఆ సుందరికేవిధమైన అన్యాయం జరగటానికి వీల్లేదురా.... బదరీ...."

"అయితే నన్నిప్పుడేం చేయమంటావో అది కూడా నువ్వే చెప్పు సోదరీ...."

"బదరీ.... నువ్వు జైలరు వయినా నీ చైల్డిష్ బుద్ధి పోలేదు. ఎలా బ్రతుకుతున్నావో ఏమో.... మరి.. మరేం లేదు. నీ డిపార్టుమెంటు ఇన్ఫ్లుయెన్స్‌తో, వైర్ లెస్‌లో లాలాపేట పోలీసు స్టేషన్‌కి కాంటాక్టు చేసి, సుబ్బారావు గారి అడ్రస్ యిచ్చి, 'సుందరి' అనే ఆవిడ ఆచూకీని కనుక్కోమని, కానిస్టేబుల్స్‌ను అక్కడకి పంపించమని మెసేజ్ యివ్వు." అన్నది ఆదుర్దాగా మణి.

మణి చెప్పినట్లు బదరీ అతని బలగమంతా అలర్టు అయ్యారు. 'వైర్‌లెస్' రూం వైపు పరుగులు తీశారు.

✻ ✻ ✻

అడపావారి వీధిలోని సుబ్బారావు ఇంటి ముందు పోలీసు జీపు దూసుకుంటూ వచ్చి ఆగింది. అక్కడి వాళ్ళు అందరూ ఆ ఇంటి ముందు చేరారు. ఇంటికి తాళం వేసివుంది.

'ఆయన ఆఫీసుకి వెళ్ళాడు. పిల్లలిద్దర్నీ తీసుకుని ఆమె ఇంతకు ముందే ఆటు కోనేటి వైపుకు వెళ్ళింది' అన్నాడు ఒకతను.

కాని "స్టేబుల్స్ ఆలస్యం చేయకుండా వెంటనే ప్రొసీడ్ అయ్యారు. వైర్‌లెస్‌లో మెసేజ్ అందజేస్తున్నట్లు 'సెర్చింగ్.... ఆన్‌ది స్పాట్... ఫర్‌దర్ ఇన్‌ఫర్మేషన్ ఫాలోస్, ఫర్‌దర్ ఇన్‌ఫర్మేషన్ ఫాలోస్.... ఓవర్...." అంటూ ఆగిపోయింది.

✻ ✻ ✻

సుబ్బారావు సుందరిని ఏదో ఇబ్బంది పెట్టినట్లు, ఆ నోటా ఆ నోటా సుబ్బారావు ఆఫీసు లోని అతని ఫ్యామిలీ ఫ్రెండు అయిన నీలకంఠరావు చెవిలోనూ పడింది. అతడు ఆ తర్వాత సీట్లో కూర్చోలేకపోయాడు. సుబ్బారావు సీటు దగ్గరకు వచ్చాడు. అతడు సీట్లో లేడు. అతడు ఎప్పుడో వెళ్ళిపోయినట్లు అటెండరు చెప్పాడు.

సుబ్బారావుని ఎలాగోలాగ నీలకంఠరావు పట్టుకోగలిగాడు. గత్యంతరం లేక జరిగినదంతా నీలకంఠరావుకు చెప్పాడు.

"ఒరేయ్ సుబ్బారావ్. నువ్వొట్టి ఫూల్‌విరా.... మా అమ్మాయి సుందరి. నువ్వు లేకుండా ఎప్పుడైనా బజారుకంటూ వెళ్ళిందటరా.... ముప్పై యేళ్ళు వచ్చినా 'నాజ్ సెంటర్'కు ఎటు వెళ్ళాలో తెలియదు. గుంటూర్లో పదేళ్ళ నుండి ఉంటున్నా పట్నం బజారు తెలియదు. నువ్వు ప్రక్కనే ఉన్నా ఆటోలో పోతుంటే అదెటు పోతుందని భయంతో వణికిపోయే ఆ అమ్మాయిని అనుమానించావంటే నీకు పుట్టగతులు ఉండవురా. అలాంటి అమాయకురాళ్ళు ఇంకా ఈ భూమ్మీద ఉండబట్టే ఈ పుడమి ఇలా నిలబడి వుందిరా" అంటూ చీవాట్లు పెట్టాడు.

సుబ్బారావు "తప్పంతా నాదేరా..... నా కళ్ళు మూసుకుపోయాయి. నేనేం చేస్తున్నానో నాకే అర్థం కాకుండా పోయింది. నన్ను క్షమించరా" అన్నాడు.

"నిన్ను క్షమించాల్సింది నేను కాదురా.... ఆ అభాగ్యురాలు సుందరి. సమయానికి పోలీసులు జోక్యం చేసుకోవటంతో సుందరి మనకు ప్రాణాలతో దక్కింది. మంచి మనస్సు ఉంటే దేవుడూ మన ప్రక్కనే ఉంటాడురా.... ఇకనైనా అనుమాన పిశాచాన్ని వెంట బెట్టుకొని తిరక్కుండా - బుద్ధి తెచ్చుకొని బ్రతుకు" అంటూ నిశితంగానే హెచ్చరించి నీలకంఠరావు సుందర్ని పరామర్శించ టానికి ఇంటికి వెళ్ళాడు.


✻ ✻ ✻

"ఒరేయ్..... బ్రదర్ బదరీ... నేను నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నీవు తీసుకున్న సమయోచిత నిర్ణయానికి - చొరవకు ఒక అమాయకురాలు బ్రతికి బయట పడింది. నిన్నే కాదు మీ పోలీసు శాఖను కూడా" అంటూ మణి

## ఆశ!

*గత రెండు సంవత్సరాలుగా టైమ్ బేడ్ అనుకుంటున్నాను. నాకంటూ ఓ ప్రత్యేకమయిన పాత్ర క్రియేట్ చేయబడ్డం గాని, ఆ పాత్రకి పేరురావడంగాని జరగలేదు. ఈ సంవత్సరం తాడో పేడో తేల్చుకుందామనుకుంటున్నాను. 2002 నాకు మంచి జరుగుతుందన్న నమ్మకం వుంది. ఒకరిద్దరు యంగ్ హీరోలతో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి అంటోంది మురిపెంగా సంఘవి.*

*(అక్కగానా? వదినగానా?)*



తన అభివాదం అందజేసింది.

"సిస్టర్, అందుకు ముఖ్యంగా అందరి ప్రశంసలు అందుకోవాల్సింది నువ్వే...." అన్నాడు బదరీ.

"ఆ సుబ్బారావు ఎవ్వరోగాని వట్టి, ఫూల్‌లా ఉన్నాడే. అస్సలు విషయమేమిటో తెలుసుకోకుండా అలా విలన్‌లాగా ప్రవర్తించటం బాగా లేదు. ప్రస్తుత కాలంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలుసుకోకపోతే యెలా?" అన్నాడు మురళి.

"తొందర పడకండి శ్రీవారూ.... నేను గుంటూరు వెళ్ళగానే ఆ సుబ్బారావు మహాశయు డికి థర్డ్ డిగ్రీ ట్రీట్‌మెంట్ యిస్తానుగా. దేవుడిచ్చిన మా అన్నయ్య సూర్యనారాయణకు జోహార్లు" అన్నది మణి.

మణి మాటలకు అందరూ హాయిగా నవ్వుకున్నారు. ❀